## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

జైపూర్, ఏప్రిల్ 26: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు రమాదేవి (36) వివాహిత పెద్దపల్లి జిల్లా లక్కెపురంలో శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పెగడపల్లికి చెందిన మాసు సత్యనారాయణ రమాదేవి భార్యా భర్తలు వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడడంతో ఇంటి వద్దనే ఉంటుండగా మృతురాలు ఉపాధిహామీ పథకంలో మేట్‌గా పని చేస్తుంది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి శెట్‌పల్లికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా లక్కెపురంలో మృతిచెందింది. మృతురాలు ఒంటిపై గాయాలుండడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రమాదేవికి పరిచయం ఉన్న మొగిళిపై అనుమానాలు ఉన్నట్లు భర్త సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంథని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కొనసాగుతున్న విచారణ

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 26: పట్టణంలోని కాలేజ్‌రోడ్డులో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని జంగంపల్లి లక్ష్మీ ప్రసన్న (19) మృతి కేసులో కొందరి అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు తెలిసింది. భీమిని మండలం జగ్గయ్యపేటకు చెందిన లక్ష్మీప్రసన్న సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నది. ఈ నెల 24న హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం, వాచ్‌మెన్, ఇతరుల వేధింపులు తట్టుకోలేకనే తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పలువురు అనుమానితులను పిలిపించి ఫోన్ కాల్ విషయం పై ఆరాతీసి, విచారించినట్లు సమాచారం.

## కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

కౌటాల, ఏప్రిల్ 26 : కౌటాల మండల కేంద్రంలో అటవీ ప్రాంతంలో నుంచి శనివారం ఉదయం చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికుల గమనించి కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే దుప్పి తీవ్రంగా గాయపడింది. అటవీ అధికారులకు అక్కడికి చేరుకొని చికిత్స అందించినప్పటికీ ప్రాణాలు కాపాడలేకపోయారు. అనంతరం కళేబరాన్ని అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు అటవీ అధికారులు తెలిపారు. అటవీ అధికారులు స్పందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే వాదనలు వినిపిస్తున్నాయి.

## దుకాణాలు తొలగింపు

కౌటాల, ఏప్రిల్ 26 : కౌటాల మండల కేంద్రంలోని కుమ్రంభీం కమిటీ హాలు ముందు ఇస్త్రీ దుకాణాన్ని జేసీబీ సాయంతో పంచాయతీ అధికారులు తొలగించారు. దీంతో బాధితుడు తన దుకాణంలోని టేబుల్, కుర్చీలు, ఇతర సామగ్రి పూర్తిగా ధ్వంసం అయ్యాయని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. చిరు వ్యాపారులకు వేరే చోట స్థలం కేటాయిస్తామని పంచాయతీ కార్యదర్శి సుబ్బసాయి కృష్ణ తెలిపారు. దుకాణా సముదాయాల విషయంలో కొద్ది రోజులుగా ఆదివాసీలు దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

## రక్తదాన శిబిరం

నస్పూర్, ఏప్రిల్ 26 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల పట్టణంలోని తపస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 37 రక్తదానం చేశారు. తలసేమియా సికిల్ సెల్, ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు అందిస్తామని తెలిపారు. తపస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు ఏర్పాటు

కోటపల్లి, ఏప్రిల్ 26 : కోటపల్లి మండలం పారుపల్లి గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పైన అంతరాష్ట్ర వరి ధాన్యం కొనుగోలు కేంద్రం చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వరి ధాన్యం రాకుండా ఈ చెక్ పోస్టు ఉపయోగపడనుందని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, ఏవో రత్న సాయికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులున్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

కోటపల్లి, ఏప్రిల్ 26 : కోటపల్లి మండలం దేవులవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్ఐ రాజేందర్ పరిశీలించారు. నిరంతరం పర్యవేక్షిస్తామని హెచ్ఎం శ్రీనివాస్ రావ్ వివరించారు

## హెల్మెట్ ధరించాలి

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 26: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ షో రూంలో నిర్వహించిన హంటర్ 350సీసీ బైక్ లాంచింగ్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనంతరం పట్టణ మున్సిపల్ శానిటరీ సిబ్బంది, కూలీలకు ఉచితంగా హెల్మెట్లను అందజేయడంపై షోరూం నిర్వాహకులను అభినందించారు.

## ఉగ్రదాడిలో మృతులకు నివాళి



మంచిర్యాలలోని రెడ్డికాలనీలో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న మహిళలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 26: కాశ్మీర్‌లోని పహల్గామలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీ వాసులు శనివారం కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ తీశారు. 'భారత్ మాతా కీ జై' అంటూ నినాదాలు చేస్తూ ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను మట్టి కరిపించాలని పేర్కొన్నారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాలనీ వాసులు, మహిళలున్నారు.

**సీపీఐ ఆధ్వర్యంలో..**

ఉగ్రవాదుల ప్రేరేపిత దేశంగా పాకిస్తాన్ వ్యవహరిస్తుందని ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, ఖలిందర్ అలీఖాన్, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, లింగం రవి, వనం సత్యనారాయణ, దొడ్డిపట్ల రవీందర్, దుర్గా రాజ్, చాడ మహేందర్ రెడ్డి, కుంచాల శంకరయ్య, పూజారి రామన్న, కోడి వెంకటేశ్, తంగళ్లపల్లె సురేశ్, పద్మ, తిరుమల, అరుణ పాల్గొన్నారు.

**ఫిట్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో..**

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 26: కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మంచిర్యాల ఫిట్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాయ్స్ హై స్కూల్ పాఠశాల మైదానంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఫిట్నెస్ సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

## శాంతిఖని గనిపై ర్యాలీ..

బెల్లంపల్లి, ఏప్రిల్ 26: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు టీబీజీకేఎస్ నాయకులు నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని ఆవరణలో కొవ్వొత్తులతో ర్యాలీ తీసి, రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదుల దాడులను పూర్తిగా అరికట్టేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యులు రమణ, దాసరి శ్రీనివాస్, బడికల రమేశ్, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కార్యదర్శి రవికిరణ్, పిట్ కార్యదర్శి హన్మంతరావు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

తాండూర్, ఏప్రిల్ 26 : తాండూర్ మండల పాత్రికేయుడు రంగ సాగర్ తండ్రి రంగ బానయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం బోయపల్లిబోర్డు లోని పాత్రికేయుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యంతో ఉండాలని కోరారు. పరామర్శించిన వారిలో దత్తాత్రేయరావు, ఎలుక రాంచందర్, ఉప్పుట్ల సంతోష్, బండి సత్యనారాయణ, కాళి భీరయ్య, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారం

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 26: విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించినందుకు అత్యుత్తమ పురస్కారం లభించింది. గంజాయి కేసులో నిందితుడు ఎస్ఆర్ఎస్పీ కెనాల్ లో దూకి పారిపోతుండగా ప్రాణాలకు తెగించి కెనాల్‌లో దూకి నిందితుడిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్న రామగుండం కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ యూ ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్‌కు రాష్ట్ర డీజీపీ జితేందర్ శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు రివార్డును అందజేశారు. వారిని డీజీపీతో పాటు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, నార్కోటిక్స్ ఏడీజీ సందీప్ శాండిల్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీజీ లా అండ్ ఆర్డర్ మహేశ్ భగవత్, ఏడీజీ పర్సనల్ అనిల్, నార్కోటిక్స్ ఎస్పీ చెన్నూరి రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

దండేపల్లి, ఏప్రిల్ 26 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలంలోని అల్లీపూర్ జీపీలో శనివారం ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సతీశ్, నర్సయ్య, శ్రీనివాస్, జీపీ కార్యదర్శి శ్రీహరి, కారోబార్ రమేశ్, తదితరులు ఉన్నారు.

## పేరు తొలగించాలని ఎమ్మెల్యే పీఏ వినతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 26 : ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏ గడ్డం దుర్గాప్రసాద్ ఇందిరమ్మ ఇల్లు ఎల్2 జాబితాలో ఉన్న తన పేరును తొలగించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే పీఏకు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల జాబితాలో ఉందని సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చ జరిగింది. దీంతో ఆయన చేసేదేమి లేక తనకు ఇల్లు వద్దని తిరస్కరిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు వినతి పత్రం సమర్పించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే విధంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తమ భార్య పేర్ల మీద దరఖాస్తు చేసుకున్న అనర్హులైన వారందరూ జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలనే డిమాండ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నది. వినతి పత్రం సమర్పించిన వారిలో కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు కంకటి శ్రీనివాస్, బండి రాము, రామగిరి శ్రీనివాస్, ఎలుక ఆకాశ్, కల్లూరి మల్లేశ్ వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

## భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

నస్పూర్, ఏప్రిల్ 26 : జైపూర్ మండలంలో నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూనిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ నిర్వాసితులు శనివారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. రోడ్డు పనుల్లో భూనిర్వాసితులకు అవకాశం కల్పించాలని, ఇతర రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్ వర్కర్లను తెచ్చి పనులు చేయిస్తే పనులను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్, రామారావు, జనార్దన్‌రెడ్డి, కృష్ణమూర్తి, భూమయ్య, ప్రభాకర్, సమ్మయ్య, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలి

నెన్నెల, ఏప్రిల్26: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం పై రైతులు తెలుసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నెన్నెల రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఏడీఏ సురేఖ, ఎంపీడీవో దేవేందర్, ఏవో సృజన, ఏఈవోలు రాంచందర్, మౌనిక, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పని చేస్తేనే లక్ష్యాల సాధన

మందమర్రి, ఏప్రిల్ 26 : సింగరేణిలోని ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేసినప్పుడే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన సాధ్యమవుతుందని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకేవోసీని ఆయన అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి కేకేవోసీ పని ప్రదేశాలను పరిశీలించారు. అలాగే ఓసీలో నిర్మిస్తున్న పీఓబీ ప్లాంట్‌ను సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో అన్ని ఏరియాల జీఎంలతో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకత పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమీక్షా సమీవేశం నిర్వహించారు. అధికారులు పలు సూచనలు ఇచ్చారు.

# హామీలు మరచి అక్రమ దందాలా..?

- పాలనలో కాంగ్రెస్ సర్కారు అట్టర్ ఫ్లాప్
- రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాడుతాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్
- మందమర్రి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ
- రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు


మందమర్రిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ విప్ బాల్క సుమన్


బైక్ ర్యాలీ తీస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మందమర్రి, ఏప్రిల్ 26 : చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఎన్నికల హామీలను మరచి అక్రమ దందాలకే పెద్దపీట వేస్తున్నారని, స్వయంగా ఎమ్మెల్యే పీఏ జోరుగా ఇసుక రవాణా సాగిస్తున్నాడని కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ బాల్క సుమన్ ఆరోపించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకొని శనివారం మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంగల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మందమర్రికి చేరుకున్న మాజీ విప్ బాల్క సుమన్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి శాలువాలతో సన్మానం చేశారు. పాతబస్టాండ్ ఏరియాలోని ఆచార్య జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన బైక్ ర్యాలీ ప్రారంభించగా, కోల్‌బెల్ట్ రహదారిపై శాంతి నగర్, విద్యానగర్, రామన్ కాలనీ, గాంధీ నగర్‌ల మీదుగా సింగరేణి పాఠశాల వరకు చేరుకున్నది. అక్కడ పార్టీ నాయకులతో కలసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాలచెట్టు ఏరియా మీదుగా మార్కెట్ సెంటర్ వరకు కొనసాగిన బైక్ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. నియోజక వర్గంలోని చెన్నూర్ ప్రాంతంతో పాటు మంథని నియోజక వర్గ పరిధిలోని గోదావరిలో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వివేక్ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయడం తప్ప.. ఈ 16 నెలల్లో ఒక్క పని కూడా చేసింది లేదన్నారు. నియోజక వర్గంలో సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసి 45 వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్న హామీని మరచి.. మంత్రి పదవి కోసం తహతహలాడుతున్నారని ఆయన విమర్శించారు. రజతోత్సవ సభ అనంతరం జిల్లాలో పార్టీ కమిటీలను వేసి అటు ప్రభుత్వం, ఇటు ఎమ్మెల్యే ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతామన్నారు. చెన్నూర్‌లో తన హయాంలో మంజూరు చేయించిన బస్ డిపో, పామాయిల్ పరిశ్రమలను ఎందుకు రద్దు చేయించారన్నారు. రజతోత్సవ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్, నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, బండారు సూరిబాబు, ఎండీ అబ్బాస్, మద్ది శంకర్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, మేడిపల్లి మల్లేశ్, బెల్లం అశోక్, అఖిలేశ్ పాండే, సీపెల్లి సాగర్, పల్లె నర్సింగ్, కనకం రవీందర్, కళ్లెజు అనిల్ కుమార్, ముస్తఫా, మహిళా నాయకులు అమృత రమాదేవి, చిప్పకుర్తి రేఖ, సుగుణ, లలిత, విజయ, శారద పాల్గొన్నారు.

### సభను జయప్రదం చేయాలి

**-మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**

**-మంచిర్యాలలో బైక్ ర్యాలీ**

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 26 : నేడు ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ తీశారు. ఐబీ చౌరస్తా నుంచి మొదలైన ర్యాలీ మెయిన్‌రోడ్, మార్కెట్‌రోడ్, బస్టాండు, బెల్లంపల్లి చౌరస్తాల మీదుగా కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ 14 ఏళ్లపాటు సుదీర్ఘంగా పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని కొనియాడారు. కాగా, రజతోత్సవ సభ సందర్భంగా మంచిర్యాల పట్టణం గులాబీమయమైంది. ప్రధాన కూడళ్లతో పాటు రోడ్లకు ఇరుపక్కలా, ఓవర్‌బ్రిడ్జి, పాతమంచిర్యాల బ్రిడ్జి, రహదారులకు మధ్యన గులాబీ జెండాలు, తోరణాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు గాదెసత్యం, అంకం నరేశ్, బేర సత్యనారాయణ, సందెల వెంకటేశ్, తోట తిరుపతి, కాటంరాజు, మధు, సుధీర్, కర్రు శంకర్, పల్లపు రాజు, పెంట ప్రదీప్, రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

# సభకు తరలిరావాలి

- రజతోత్సవ సభపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రచారం


శ్రీరాంపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ రజతోత్సవ సభపై శ్రీరాంపూర్‌లో 5, 6, 17 వార్డులు ఆర్కే 6 గుడిసెలు, శ్రీరాంపూర్ కాలనీలో బీఆర్ఎస్ వార్డు ఇన్‌చార్జిలు మల్లెత్తుల రాజేంద్రపాణి, ఎండీ రఫీఖ్‌కాన్, మాజీ ఎంపీటీసీ లాట్కూరి రాయలింగు, గుమ్మడి శ్రీనివాస్‌లు పోస్టర్లతో ప్రచారం చేశారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపతి తిరుపతి, సందినేని శ్రావణ్ పాల్గొన్నారు.

**చెన్నూర్ పట్టణానికి రజతోత్సవ శోభ**

చెన్నూర్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ప్రధాన రహదారుల గుండా పార్టీ జెండాలు, తోరణాలతో చెన్నూర్ పట్టణ మంతా గులాబీ మయమైంది. వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గోడలపై వాల్ రైటింగ్ రాయించారు. పోస్టర్లను అంటించి, వాడల్లో సభ గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. ప్రజలంతా స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో సభకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

**రజతోత్సవ సభకు తరలిరండి**

రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి రావాలని కోరారు.

**బైక్ ర్యాలీకి తరలిన మండల నాయకులు**

మందమర్రిరూరల్, ఏప్రిల్ 26 : రజతోత్సవ సభపై మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు , చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి, గుర్రం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆదిల్ పేట గ్రామంలో..**

మందమర్రిరూరల్, ఏప్రిల్ 26 : మందమర్రి మండలం నుంచి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండల ప్రజలు భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పబ్లిసిటీ ఇన్‌చార్జి తైదల జంపన్న, నాయకులు గుర్రం శ్రీనివాస్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, రాజయ్య, మొగిలి, రవీందర్, భీంరావు, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మందమర్రి రూరల్ : గ్రామాల నుంచి బైక్ ర్యాలీకి వెళ్తున్న మండల నాయకులు


ఆదిల్ పేట గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 26 : జిల్లాలో మే 4న నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు 1,204 మంది అభ్యర్థులకు గాను మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజీవ్‌నగర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్, పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాలను పూర్తి బందోబస్తుతో భద్రపర్చుతామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144,163 సెక్షన్లను అమలు చేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కేంద్రాల్లో సిబ్బందిని నియమించాలని, పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడిపించాలన్నారు. ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి, కేజీబీవీ ప్రిన్సిపసల్ ప్రసాద్, అధికారులున్నారు.

**నీట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి**

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 26: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించనున్న నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు. శనివారం న్యూఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో అర్హత ప్రవేశ పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఏఎస్పీ ప్రభాకర్ రావు, అధికారులతో కలిసి హాజరయ్యారు. పొరపాట్లకు తావు లేకుండా పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో పరీక్షల సమన్వయకర్త లక్ష్మీనరసింహ, పరిశీలకులు, అధికారులు శశిధర్ తదితరులున్నారు.

## రోడ్డు పనులను అడ్డుకున్న అధికారులు

- గ్రామస్తుల ఆగ్రహం..ఆందోళన


అటవీశాఖ అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని బూరెపల్లిలో శనివారం రోడ్డు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలో రోడ్లు వేసేందుకు అనుమతులు లేవని పనులు నిలిపివేయాలని అటవీ శాఖ అధికారులు సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. బూరెపల్లిలో రోడ్లు, బోర్లు కూడా వేయవద్దని నూతనంగా ఇండ్ల నిర్మించవద్దని తెలిపారు. దీంతో అభివృద్ధి పనులను అడ్డుకోవడంపై అటవీ శాఖ అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## సెల్ టవర్ తొలగించాలని ఆందోళన

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 26 : నస్పూర్‌లోని అభినవ కాలనీలోగల ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో సెల్ టవర్ ఏర్పాటు చేశారని, రేడియేషన్ ప్రభావంతో రోగాలబారిన పడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే, విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులను కలిసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. సెల్ టవర్‌ను తొలగించే వరకూ పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.


సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు

## అనర్హులకు ఇండ్లు ఇచ్చారని ఫిర్యాదు

కెరమెరి, ఏప్రిల్ 26: అర్హులైన నిరుపేదలను విస్మరించి అనర్హులైనవారికే ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పేర్లు నమోదు చేశారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోర్ల వెంకటేశ్ ఆరోపించారు. శనివారం ఆయన సోషల్ మీడియా వేదికగా తన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు అధికారులకు ఫోన్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లలో ఎంపిక చేయాలని ఒత్తిడి చేయడం విచారకరమన్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో అర్హులకు అన్యాయం జరుగుతుందని, ఈ విషయంపై కలెక్టర్‌కు తెలిపి ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు అర్హులకే ఇస్తాం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 26: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## అవగాహన కోసమే భూభారతి సదస్సులు

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన, ఏప్రిల్ 26: భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం లో పొందుపరచిన అంశాలు, హక్కులపై రైతులకు అవగాహన కల్పించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. రెబ్బెనలోని రైతువేదికలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఆర్‌టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఏవో దిలీప్, డీటీ వరలక్ష్మి, ఏపీఎం వెంకటరమణశర్మ, ఆర్ఐలు, ఏఈవోలు, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

**తిర్యాణి, ఏప్రిల్ 26:** తిర్యాణి మండలకేంద్రంలోని బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై శనివారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. చట్టంలోని నిబంధనలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, తహసీల్దార్ సూర్యప్రకాశ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ వివిధ గ్రామాల్లోని రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

వాంకిడి, ఏప్రిల్ 26 : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని చిన్నా వాంకిడి, బోర్ద గ్రామాలను శనివారం అధికారులతో కలిసి పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో, బోర్ద గ్రామంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీపీవో, ఎంపీడీవో, ఎమ్మార్వో, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలు తదితరులు ఉన్నారు.

## సామ్, మామ్ పిల్లలను గుర్తించాలి

వాంకిడి, ఏప్రిల్ 26 : మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల, ఎత్తు, బరువులు తీసి వారి ఆరోగ్య స్థితిని అంచనా వేసి, సామ్, మామ్ పిల్లలను గుర్తించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి డాక్టర్.ఆడేపు. భాస్కర్ అన్నారు. అంగన్వాడీ టీచర్లతో శనివారం మండలం బంబారలో రైతువేదికలో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

## తాగునీటి సరఫరాలో అధికారులు విఫలం

తిర్యాణి,ఏప్రిల్ 26: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని గడలపల్లి మాజీ ఎంపీటీసీ, బీజేపీ మండలాధ్యక్షుడు సారా రమేశ్ గౌడ్ ఆరోపించారు.గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ మండల ప్రత్యేక అధికారి (డీటీడీవో)రమాదేవి, ఎంపీడీవో వేముల మల్లేశ్‌కు శనివారం వినతిపత్రాలు అందజేశారు. మిషన్ భగీరథ, ఆర్ఎస్‌డబ్ల్యూఎస్ పథకాల నిర్వహణను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మడావి సీతారాం, నాయకులు తోడసం భాస్కర్, పులి వెంకటేశ్, గాయెంగి తిరుపతి, రంగు అరుణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

వాంకిడి,ఏప్రిల్ 26 : వాంకిడి పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని, పోలీస్ అధికారులను కుమ్రం భీం జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్‌దాస్ ఆదేశించారు. శనివారం వాంకిడిలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదు స్వీకరణ, బాధితులతో మర్యాదగా ప్రవర్తించడం, సైబర్ నేరాల, తదితర అంశాలపై సూచనలు చేశారు. ఏఎస్పీ వెంట సీఐ సత్యనారాయణ తదితరులున్నారు.

## పోడు భూముల వివరాలు అందించాలి

బెజ్జూర్, ఏప్రిల్ 26 : మండలంలోని కర్జెల్లి అటవీ రేంజ్ పరిధిలోని సాగు చేస్తున్న రైతులు పోడు భూముల వివరాలు అందించాలని కర్జెల్లి డీఆర్వో సంతోష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని కాటెపల్లి, కుకుడ మరియు అంబాగట్ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. రైతులు వద్ద గల పోడు పట్టాలను జిరాక్స్ కాపీలు ఇవ్వాలని అన్నారు. ఆ భూములను ఎవరు సాగు చేస్తున్నారు..ఎవరికైనా అమ్ముకున్నారా. అనే వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ సుక్రు, రైతులు సడ్మెక పురుషోత్తం, రహ్మత్ , ఎర్మ బాబాజి, సడ్మెక రామయ్య, పడాల మధూకర్, జాడి సోమయ్య, గుర్లె విలాస్, కోర్తె దస్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూములను పరిరక్షించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 26: జిల్లా కేంద్రంలోని కేశవనాథ స్వామి ఆలయ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. శనివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేశవనాథ స్వామి ఆలయానికి మొత్తం దాదాపు 90 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అందులో గోవింద్ పూర్ సమీపంలోని 83 సర్వే నంబర్‌లో ఉన్న 8.22 ఎకరాల భూమిలో కొంత ఆక్రమించి తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్నారని అన్నారు. గతంలో రెవెన్యూ పరిధిలో ఉన్న క్రమంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు ఆలయానికి నిర్ణీత కిరాయి చెల్లించాలని ఒప్పందాలు చేసుకున్నప్పటికీ ఒక్క పైసా కూడా కట్టలేదన్నారు. ఎండోమెంట్ శాఖా అధికారులు ఇప్పటికైనా పూర్తి సర్వే చేయించి ఆలయ భూములను పరిరక్షించాలని, ఆలయ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నిమ్మకంటి సుగుణాకర్, మనోజ్, వెంకట్ రవీందర్, రాజేశ్వర్ రావు, పూజారి నరేశ్ శర్మ తదితరులున్నారు

## ఆర్టీసీ యాప్‌లపై ప్రచారం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 26: ఆర్టీసీ అందిస్తున్న వివిధ రకాల సేవలకు సంబంధించిన అప్లికేషన్‌లపై ఆర్టీసీ అధికారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ను మర్యాదపూర్వకంగా కలిసి యాప్ పై గురించి వివరించారు. ఎస్పీతో పాటు సీఐ, జిల్లా ఫైర్ అధికారికి క్యూఆర్ కోడ్ స్కానర్ తో కూడిన ప్రత్యేక కీ చైన్‌ను అందజేశారు.